ప్రజాశక్తి
గురువారం 26 అక్టోబర్ 2023 5
అనంతపురం





తెగుళ్లు సోకి ఆకులేక కర్రలు మాత్రమే మిగిలిన ఆముదం మొక్కలు

నేటి నుంచి సామాజిక సాధికార యాత్ర

◆ శింగనమలలో నేడు ప్రారంభం ◆ హాజరుకానున్న వైసిపి ముఖ్య నేతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'సామాజిక సాధికార యాత్ర' పేరుతో వైసిపి చేపట్టిన బస్సు యాత్ర నేడు అనంతపురం జిల్లాలో ప్రారంభం కానుంది. రాయలసీమ జిల్లా వ్యాప్తంగా ఈ యాత్ర సాగనుంది. జిల్లాలోని శింగనమల నియోజకవర్గంలో ఈ యాత్ర ప్రారంభం కానుంది. ఉదయం శింగనమల మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ప్రారంభమై మధ్యాహ్నం మూడు గంటలకు బుక్కరాయసముద్రం చేరుకుంటుంది. అక్కడ అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ సభను నిర్వహించనున్నారు.

హాజరు కానున్న ముఖ్య నేతలు

రాయలసీమలో ప్రారంభమయ్యే సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభ కార్యక్రమానికి వైసిపి ముఖ్య నేతలు హాజరుకానున్నరు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరవుతున్నారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్, అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య తదితరులు పాల్గొననున్నారు.

ఏర్పాట్లు సిద్ధం

ఈ యాత్రను పెద్దఎత్తున జయప్రదం చేసేందుకు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిలు ఏర్పాట్లను చేపట్టారు. తమ నియోజకవర్గం పరిధిలో నుంచి ఈ యాత్ర ప్రారంభం కానుండటంతో తొలి కార్యక్రమాన్ని ఘనవిజయం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రహదారి పొడవునా కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో ఎన్నికలు కూడా రానున్న నేపథ్యంలో ఒక రంగా బల ప్రదర్శన చేపట్టాలన్న యోచనలోనూ వీరున్నారు.



సామాజిక మద్దతు లభించేనా. ?

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో వైసిపి బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీల మద్దతు కూడగట్టేందుకు యాత్రలను చేపట్టింది. ప్రధానంగా బీసీ, ఎస్సీ జనాభా అధికంగానున్న నియోజకవర్గాలపై దృష్టి సారించింది. ఇక్కడ ఈ యాత్రల ద్వారా మద్దతు కూడగట్టే ప్రయత్నం చేపట్టింది. సామాజిక తరగతులకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించామని చెప్పే ప్రయత్నం వైసిపి చేపడుతోంది. అయితే సామాజిక ప్రాధాన్యత కేవలం రాజకీయ పదవుల్లోనేనా... అన్న చర్చ మాత్రం విపక్షాల నుంచి నడుస్తోంది. ఈ సామాజిక తరగతులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయి. ఈ తరగతులు విద్య, ఆర్థికం ఎదగటానికి గతంలోనున్న అనేక పథకాలు ఈ నాలుగన్నరేళ్ల కాలంలో అమలుకు నోచుకోలేదు. మరోవైపు దళితులపై దాడులు జరిగిన ఘటనలు అనేకమున్నాయి. వివక్ష పెద్దఎత్తున కొనసాగుతూనే ఉంది. వీటి నిర్మూలనకు తీసుకున్న చర్యలేవి కనిపించటం లేదు. ఇటువంటి చర్యలేవి తీసుకోకుండా సామాజిక మద్దతు కూడగట్టడం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు సామాజిక సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. కేవలం రాజకీయ పదవులు, అది కూడా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించినంత మాత్రాన సామాజిక సాధికారత సాధ్యమవుతుందా అన్న ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. వీటిని వైసిపి ఈ యాత్ర ద్వారా ఏ మేరకు నివృత్తి చేయగలదో చూడాల్సి ఉంది.



ఆముదంకు తెగుళ్లు

'నామాల'తో పంట నాశనం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ప్రతి ఏటా వేరుశనగ సాగు చేసిన రైతులకు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట చేతికందకుండా పోయింది. పెట్టుబడులు కూడా చేతికరాక అప్పుల ఊబిలో కూరకుపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించారు. అందులో భాగంగా గుంతకల్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ఆముదం పంట సాగుపై దృష్టి సారించారు. తక్కువ వర్షం, తక్కువ ఖర్చు అయ్యే ఆమదును రైతులు సాగు చేశారు. మండల పరిధిలో దోసలుడికి, సంగాల, కసాపురం, అమిన్‌పల్లి తదితర గ్రామాల్లో దాదాపు వంద హెక్టార్లలో ఈ పంటను సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకి రూ.10వేల నుంచి నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతంది. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో దీనికి తెగుళ్లు సోకుతున్నాయి. ముఖ్యంగా నామాల అనే తెగుళ్లు పంటను పూర్తి స్థాయిలో దెబ్బతీస్తున్నాయి. నామాల పురుగు ఆశించి ఆముదం ఆకులు, పూతను పూర్తిగా తొలిచివేస్తోంది. చెట్టుకు బర్రలు తప్ప ఏమీ మిగలడం లేదు. పురుగు సంహారానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం శూన్యంగా ఉంది. పురుగు ఆకు కింది భాగాన్ని ఆశించి ఆకులు, పూతను పూర్తిగా తినేస్తోంది. ఈ పురుగు నివారణకు క్రిమిసంహారక మందులు అధికంగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడులూ విపరీతంగా పెరుగుతున్నాయి. ఇలా చేసినా పంట చేతికొచ్చే పరిస్థితి కన్పించడంలేదు. ఆకులు పూర్తిగా తెగుళ్ల బారిన పడడంతో రైతులు చేసేది లేక పంటను తొలగించేస్తున్నారు. పంట ఈ విధంగా దెబ్బతింటున్న తరుణంలో సకాలంలో వ్యవసాధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. తమ బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఆముదం రైతులు సతమతం అవుతున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి తెగుళ్లు సోకిన ఆముదం పంటను పరిశీలించి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. పంటను పూర్తిగా నష్టపోయిన వారికి ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



తెగుళ్లు సోకడంతోపంటను తొలగించేస్తున్న రైతులు



తల్లిపాల వారోత్సవంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది (ఫైల్ ఫొటో)

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణలో

అనంతకు 3వ స్థానం

అనంతపురం కలెక్టరేట్ : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణలో అనంతపురం జిల్లా దేశంలోనే 3వ స్థానంలో నిలిచింది. ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్ - 2023 ఫలితాల్లో దేశంలోనే అనంతపురం జిల్లా సత్తాచాటి 3వ స్థానం కైవసం చేసుకుంది. ఈ మేరకు బుధవారం నాడు ఢిల్లీ, బిపిఎన్ఐ (బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా) నుంచి జిల్లా ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవికి ఈమెయిల్ ద్వారా సమాచారం అందింది. జిల్లాలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై కలెక్టర్ ఎం.గౌతమి నిరంతర పర్యవేక్షణ చేయడంతో అత్యుత్తమ స్థాయిలో వారోత్సవాలను ఐసిడిఎస్ అధికారులు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై దేశంలోని 14 రాష్ట్రాల నుంచి బిపిఎన్ఐకు మొత్తం 77 నివేదికలు అందాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 6 రకాల ఎంట్రీలు వెళ్లాయి. ఇందులో అనంతపురం జిల్లా నుంచి 2,302 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పూర్తిస్థాయిలో నిర్వహించడం జరిగిందని ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి నివేదిక పంపించారు. ఇందులో ఢిల్లీకి చెందిన డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ (యుసిఎంఎస్, జిటిబి హాస్పిటల్) దేశంలో 1వ స్థానంలో నిలవగా, మహారాష్ట్రకు చెందిన నిరమయ హెల్త్ ఫౌండేషన్ 2వ స్థానంలో నిలిచింది. ఇక అనంతపురం మహిళా అభివద్ధి, సంక్షేమ శాఖ దేశంలోనే 3వ స్థానంలో నిలిచింది. ఈ ఘనతపై కలెక్టర్ ఎం.గౌతమి హర్షం వ్యక్తం చేశారు. తల్లిపాల వారోత్సవాల నిర్వహణలో దేశంలోనే అనంత జిల్లా 3వ స్థానంలో నిలవడం ఎంతో గొప్ప విషయం అన్నారు. జిల్లాకు పేరు రావడానికి కష్టపడి పనిచేసిన ఐసిడిఎస్ పీడీ, అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి మాట్లాడుతూ కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో జిల్లాలో సమర్థవంతంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించామన్నారు. జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలపై వివిధ కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

ఐదుగురికి చం.స్పందన పురస్కారాలు

అనంతపురం కలెక్టరేట్ : చం.స్పందన ఆత్మీయ సాహితీ పురస్కారం 2022 సంవత్సరానికి ఐదుగురు ఎంపికైనట్లు 'స్పందన' అనంతకవుల వేదిక అధ్యక్షులు తూముచర్ల రాజారామ్, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర శాస్త్రి బుధవారం తెలిపారు. ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు హైదరాబాదుకు చెందిన కవి కృపాకర్ మాదిగ రాసిన "పంచుకుందాం రా" బహుజన మహాకావ్యానికి లభించినట్లు తెలిపారు. 'స్పందన' అనంత కవుల వేదిక ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచిన సందర్భంగా 'స్పందన' ద్విదశాబ్ది ప్రత్యేక పురస్కారాలు మరో నలుగురికి అందజేయాలని సంస్థ నిర్ణయించినట్లు తెలిపారు. 'స్పందన' ద్విదశాబ్ది విశిష్ట పురస్కారాలను అందుకున్న వారిలో "మా నాయిన పాట" కవితా సంపుటి రాసిన కాకినాడకు చెందిన కవి సుంకర గోపాలయ్య," కల్లంచుల బువ్వ" దీర్ఘ కవిత రాసిన కళ్యాణదుర్గంకు చెందిన కవి ఇ.రాఘవేంద్ర, "మొలగొలుకు చేను" కవితా సంపుటి రాసిన నెల్లూరుకు చెందిన కవి పేరిశెట్ల శివకుమార్, "పూల నిప్పులు" కవితా సంపుటి రాసిన ఆదోనికి చెందిన కవయిత్రి స్వయంప్రభ ఎంపికైనట్లు తెలిపారు. నవంబరు 19న ఆదివారం అనంతపురంలో నిర్వహించే పురస్కార గ్రహీతలకు నగదు బహుమతులతో పాటు ఘనమైన కవి సత్కారంతో పురస్కారాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

29న సిపిఎం ఆధ్వర్యంలో సెమినార్

◆ జిల్లా సమగ్రాభివృద్ధి- ప్రత్యామ్నాయ విధానాలపై చర్చ ◆ బ్రోచర్ల ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమగ్రాభివృద్ధి- ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ సెమినార్‌ను అనంతపురం తపోవనంలోని రేడియంట్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అభివద్ధి అంటే కొద్ది మంది వ్యక్తులు కుబేరులుగా మారి వారి సంపదను పెంచుకోవడమా..? లేక అత్యధిక ప్రజల జీవితాల్లో పురోగతి సాధించడమా? అని ప్రశ్నిస్తే ప్రజల అభివద్ధే నిజమైన అభివద్ధి అని అందరూ చెబుతారని తెలిపారు. తరతరాలుగా వెనుకబడిన జిల్లా ప్రజల అభివద్ధికి ప్రత్యేక ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు చేయాలని అనేక కమిటీలు సిఫార్సులు చేశాయని తెలిపారు. తద్వారా వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, ప్రభుత్వ విద్యా, వైద్యం, సామాజిక తరగతుల అభివద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించాయని తెలిపారు. కొత్త అనంతపురం జిల్లా ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతోందని, రాష్ట్రం చీలి ఒక దశాబ్దం దాటుతోందన్నారు. కానీ జిల్లా సమగ్రాభివద్ధి కోసం ప్రభుత్వాలు ఏమి చేయాలి? అనే అంశంపై ఒక్క సమీక్ష కూడా సమగ్రంగా జరగలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా ప్రజల ఆకాంక్షలు ఏమిటీ? ప్రభుత్వాల ప్రాధాన్యతలో అనంతపురం జిల్లా ఎందుకని లేదు? అప్పర్‌భద్ర, కష్ణా, జలాల పున్నపంపిణీపై జరుగుతున్న చర్చ సందర్భంలో అనంతపురం సాగునీటి పరిస్థితి ఏమిటీ? నూతనంగా జిల్లాలో ఒక్క పరిశ్రమ స్థాపించకుండా యువతకు ఉపాధి ఎలా కలిపిస్తారు? విద్యా, వైద్యం ఖరీదైన వ్యాపారంగా మారుస్తూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ప్రజల భవిష్యత్ ఎలా అభివద్ధి చేస్తారు? వివిధ అంశాలపై చర్చించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో నిష్ణాతులైన ప్రముఖులు సెమినార్‌కు హాజరవుతున్నారని తెలిపారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

నాలుగు సెషన్లగా సెమినార్

నాలుగు సెషన్లగా జరిగే సెమినార్‌ను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన 29వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని రాంభూపాల్ తెలిపారు. కీలక ఉపన్యాసకులుగా కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్ హాజరవుతున్నట్లు తెలిపారు. ముఖ్యవక్తగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు వ్యవసాయం- నీటిపారుదల అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. ఈయన జిల్లాలో నీటి ప్రాజెక్టులు - ప్రస్తుతస్థితి - సాగునీటి అభివద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడతారని తెలిపారు. ఎస్.ఎం.బాషా నీటి రంగ నిపుణులు. జిల్లాలో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు - ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగిస్తారని తెలిపారు.

రెండవ సెషన్ పరిశ్రమలు- ఉపాధి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు - ప్రభుత్వాల బాధ్యత అనే అంశంపై ఎస్ఐడిబిఐ ప్రాజెక్టు మెనేజర్ ప్రొఫెసర్ ఎండి.బావయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ఐటి ఇతర రంగాల్లో ఉపాధి అవకాశాలు - ఆటంకాలు అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ కాస్ట్రో కిరణ్ మాట్లాడతారని తెలిపారు. మూడవ సెషన్ సామాజిక తరగతులు - అభివద్ధి - ఆటంకాలు జిల్లాలో సామాజిక తరగతుల వెనుకబాటు- అభివద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజా పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ సత్యబోస్ జిల్లాలో వలసలు- సామాజిక సమస్యలు అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. మహిళలు- వ్యవసాయం-సామాజిక సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాలు-పోటీపరీక్షలు-సామాజిక సమస్యలు అనే అంశంపై విద్యావేత్త ఎం.ఇలియాజ్, సామాజిక వేత్త శ్రీమతి ప్రసంగిస్తారని తెలిపారు. నాల్గవ సెషన్ విద్యా వైద్యం జిల్లాలో విద్యారంగం పరిస్థితి ప్రభుత్వ విద్య ఆవశ్యకత జిల్లాలో వైద్యంపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజల పరిస్థితి ప్రభుత్వ వైద్యం ఆవశ్యకత అంశంపై ప్రజావైద్యులు డాక్టర్ పి.ప్రసూన ప్రసంగిస్తారని తెలిపారు. అనంతపురం జిల్లా సమగ్రాభివద్ధి కోసం ప్రత్యామ్నాయ విధానాల కోసం నిర్వహిస్తున్న సెమినార్‌కు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈవిఎంల పరిశీలన : కలెక్టర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు మొదటి దశ ఈవిఎంల పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ పరిశీలనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకి 7,057 బ్యాలెట్ యూనిట్స్, 5,462 కంట్రోల్ యూనిట్స్, 6,752 వివి ప్యాట్స్ ఈవిఎంలు వచ్చాయన్నారు. ఈవిఎంలు, వివి ప్యాట్స్‌ల పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 2,628 బ్యాలెట్ యూనిట్స్, 2,260 కంట్రోల్ యూనిట్స్, 2,330 వివి ప్యాట్స్ ఈవిఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేశామన్నారు. ఈనెల 27వ తేదీన ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం-2024 కింద డ్రాఫ్ట్ పబ్లికేషన్‌కు వెళ్తున్నామన్నారు. ఫామ్-7 డిలీషన్స్‌కు సంబంధించి డిలీషన్ కాకపోతే ప్రొసీజర్స్ ప్రకారం మళ్లీ తొలగించనున్నట్లు చెప్పారు. అనంతరం అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్లో బుధవారం నాడు ఈవిఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ పరిశీలన కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమి పరిశీలించారు. మొదటి దశ కార్యక్రమాన్ని తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీలాదర్ కనకరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా సామాజిక న్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

శింగనమల నియోజకవర్గంలో సామాజిక న్యాయం ప్రజలకు అందని ద్రాక్షలా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సామాజిక న్యాయం పేరుతో అధికార పార్టీ శింగనమల నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహిస్తోందన్నారు. సామాజిక న్యాయం అమలు చేయకుండా దాని గురించి చెప్పుకుంటూ అధికార పార్టీ నాయకులు యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శింగనమల నియోజకవర్గంలో దళితులు, గిరిజనులపై దాడులు నిత్యకృత్యం అయ్యాయని తెలిపారు. దళిత, గిరిజన ప్రజాప్రతినిధులపై అధికార పార్టీ నేతల పెత్తనం కొనసాగుతోందన్నారు. గ్రామంలో పెత్తందారులకు తెలియకుండా ఏపనీ జరగని పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వం 9 గ్రామీణ ప్రాంతాల్లో అంబేద్కర్ భవనాల కోసం నిధులు ఇస్తే వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేశారన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం కోసం సర్వే నెంబరు 539 - 2, 540-2లో ఉన్న 71 సెంట్లను భూమిని అధికార పార్టీ నేతలు అన్యాక్రాంతం చేసి స్థిరాస్తి వ్యాపారానికి ప్రయత్నం చేసిన మాట వాస్తవం కాదాని ప్రశ్నించారు. శింగనమల నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క గిరిజన గురుకుల పాఠశాల నూతన భవనాల నిర్మాణంకు ఒక్క పైసా కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. శింగనమల, బుక్కరాయసముద్రం మండలాల్లో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయలేదన్నారు. పుట్లూరు మండలంలో జూనియర్ కాలేజ్ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. శింగనమలలో జూనియర్ కాలేజీలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయలేని స్థితి ఉందన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయించలేని స్థితిలో వైసిపి నాయకులు ఉన్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఒక్క ఐటిఐ కళాశాల కూడా లేదన్నారు. కుల వివక్షత అంటరానితనం కూడా శింగనమల నియోజకవర్గంలో అధికంగా ఉందన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా స్పందించిన స్థితిలో అధికార పార్టీ నేతలు ఉన్నారన్నారు. ఐదవ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కాలువ ఎర్రగుంట్ల నుంచి సలకం చెరువు వరకు కాలువ ఆధునికరణ పనులపై ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు సామాజిక నినాదాన్ని మాటల్లో కాకుండా ఆచరణలో చేసి చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, నాయకులు నాగేంద్ర, నెట్టికంటయ్య, పుల్లయ్య, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రజలు వివిధ సమస్యలపై అందించే అర్జీలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం పెద్దవడుగూరులోని టిటిడి కళ్యాణమండపంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎల్డీవో శంకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 149 అర్జీలను ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో స్థానిక సమస్యలపై వచ్చిన ఆర్జీలను మండల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా సకాలంలో అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో మండల స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లనాయక్, ఆర్ఐఒ వెంకటరమణ నాయక్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, స్పందన తహశీల్దార్ వాణిశ్రీ, తహశీల్దార్ నాగభూషణం, ఎంపిడిఒ కుళ్లాయిస్వామితో పాటు వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి

గుర్తింపు లేని నర్సరీలపై చర్యలేవీ..?

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రమైన ఆత్మకూరులో ప్రభుత్వ గుర్తింపు లేకుండా అనధికారికంగా నర్సరీలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మకూరు శివారులో దాదాపు 10 నర్సరీలు నిర్వహిస్తున్నారు. అందులో ఎక్కువ శాతం నర్సరీలకు ప్రభుత్వ గుర్తింపు కానీ, సంబంధిత అధికారుల అనుమతి కానీ లేదని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, అందులో నిబంధనల మేరకు నిర్వాహకులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి వాటిని నాటి నాణ్యమైన మొక్కలనే రైతులకు అమ్మాల్సి ఉంటుంది. గుర్తింపు కలిగిన నర్సరీలో రైతులు మొక్కలు కొనుగోలు చేసి రశీదు పొందాల్సి ఉంటుంది. ఆ మొక్కల పెరుగుదల సరిగా లేకపోయినా, దిగుబడి రాక నష్టం వాటిల్లినా ప్రభుత్వం నుంచి పరిహారం, తదితర ప్రయోజనాలు వర్తిస్తాయి. గుర్తింపులేని నర్సరీల్లో మొక్కలు కొని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు వర్తించవు.



ఆత్మకూరులో నర్సరీ

అయితే ఆత్మకూరులో నిర్వహిస్తున్న నర్సరీల పూర్తి సమాచారం, రిజిస్ట్రేషన్, లైసెన్స్, తదితర వివరాలు సేకరించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. కనీసం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది కూడా వాటి వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు గుర్తింపు లేని నర్సరీలపై చర్యలు తీసుకోవండంతో పాటు గుర్తింపు కలిగిన నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచేలా నిర్వాహకులకు ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు రక్ష

ఎమ్మెల్యే పద్మావతి, జడ్పి చైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిరుపేదలకు రక్ష అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జడ్పి చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో బుధవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై కంటి పరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. అలాగే నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డా. వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ పేదల ఆరోగ్యం కోసం నిరంతరం తపిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, తహశీల్దార్ ఈశ్వ రమ్మ, ఎఒ అన్వేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి శ్రీనివాసులు, ఎంపిపి యోగేశ్వరి, వైసిపి నాయకులు బొమ్మన శ్రీరాంరెడ్డి, ఆలూరు



కల్లుమడిలో ఆర్‌బికె భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి, జడ్పి చైర్‌పర్సన్ గిరిజ

ఎర్రిస్వామిరెడ్డి, నాటక అకాడమీ చైర్‌పర్సన్ సిహెచ్ ప్రమీల, జడ్పిటిసి కంచిరెడ్డి సుధారెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచి పకీరమ్మ, కొండయ్య, నల్లప్ప, రామాంజనేయులు, వీరనారాయణ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు రక్ష అని జడ్పిటిసి నీలం భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నీలంపల్లి సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో స్థానిక పిహెచ్‌సి, కొర్రపాడు వైద్య సిబ్బంది 508 మందికి చికిత్స చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బిఎన్.శ్రీదేవీ, ఎంపిడిఒ తేజోష్ణ, ఐఒఆర్‌డి దామోదరమ్మ, చదల్ల గ్రామ సర్పంచి ఎన్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు, ఈ-కెవైసి పూర్తి

జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఈ-పంట నమోదు, పంట నమోదు చేసుకున్న రైతుల ఈ-కెవైసి పూర్తి చేశామని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లాలో 4 లక్షల హెక్టార్లకు గానూ 4.01 లక్షల హెక్టార్లు అంటే వంద శాతం పంట నమోదు పూర్తయ్యిందన్నారు. అలాగే మొత్తం 2.72 లక్షల మంది రైతులకు గానూ ఇప్పటి వరకూ 2.66 లక్షల మంది రైతులకు అంటే 98 శాతం రైతుల ఈ-కెవైసి పూర్తి చేశామన్నారు. ఈ-పంట నమోదు మార్గదర్శకాల ప్రకారం ఈ పంట నమోదు పూర్తయిన తర్వాత సోషల్ ఆడిట్, గ్రామసభ నిర్వహించాలని ఆదేశించామన్నారు. అందుకనుగుణంగా ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఈ పంట నమోదు, ఈ-కెవైసి చేసుకున్న రైతుల్క జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. అలాగే గ్రామ సభలు నిర్వహించి రైతుల వివరాలు తెలియజేస్తామన్నారు. పంట నమోదు జాబితాలో రైతు పేరు, విస్తీర్ణం, పంటను సరిచూసుకొని, ఏదైనా సమస్య ఉంటే సంబంధిత ఆర్‌బికె సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సోషల్ ఆడిట్ ఫిర్యాదుల పరిష్కారానికి ఆఖరి గడవు ఈ నెల 29వ తేదీ అని, ముసాయిదా జాబితాను ఆర్‌బికె వద్ద 30వ తేదీ ప్రదర్శిస్తామన్నారు.

నేడు 'సామాజిక సాధికార బస్సు యాత్ర'

ప్రజాశక్తి-పుట్లూరు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుని వివరించడానికి చేపడుతున్న 'సామాజిక సాధికారిక బస్సు యాత్ర'ను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం వారు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయాన్ని ప్రజలకు వివరించేందుకు 'సామాజిక సాధికారిక బస్సు యాత్ర'లో భాగంగా గురువారం(నేడు) సాయంత్రం 4 గంటలకు బుక్కరాయసముద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ సభకు నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 1వ తేదీ నుంచి 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం సామాజిక సాధికార బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమం



బస్సు యాత్ర పోస్టర్లు విడుదల చేస్తున్న సాంబశివారెడ్డి, తదితరులు

లో శింగనమల మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బి.సునిత, ఎంపిపి రాఘవరెడ్డి, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామంజులరెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నార్పల : 'సామాజిక సాధికారిక బస్సు యాత్ర'లో భాగంగా బుక్కరాయసముద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, సానుభూతిపరులు, మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

బూదిగుమ్మ బ్రిడ్జి నిర్మాణం చేపట్టండి

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండల పరిధిలోని బూదిగుమ్మ వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ బుధవారం జనసేన, బిజెపి ఆధ్వర్యంలో తహశీల్దార్ డి.ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. బిజెపి, జనసేనపార్టీల మండల అధ్యక్షులు వన్నూరుస్వామి, కాశంశెట్టి సుధీర్ మాట్లాడుతూ బూదిగుమ్మ వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి లేకపోవడంతో దాదాపు 20 నుంచి 25 గ్రామాలు ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. గతంలో వివిధ ప్రాంతాల నుంచి బస్సుల రాకపోకలు ఉండేవని, పెన్నా నదికి నీరు చేరి కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికై ఇటీవల అనుమతులు వచ్చాయని, ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో బిజెపి మండల నాయకులు కె.మనోహర్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ నిర్వహణ కార్యదర్శి వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ ఓబులేసుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

ఉపాధ్యాయులకు అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు

దేశవ్యాప్తంగా 3, 6, 9వ తరగతి(ప్రభుత్వ, ప్రయివేటు, స్థానిక సంస్థల పాఠశాలలు) విద్యార్థులకు భాష, గణితం సబ్జెక్టుల్లో సామర్థ్యాలను పరీక్షించడానికి నవంబర్ 3వ తేదీ నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే(ఎన్ఎఎస్) నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని 18 పాఠశాలల నుంచి 32 తరగతులను ఎంపిక చేశారు. ఈ క్రమంలో మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయించడానికి ఎంఇఒలు నరసింహారెడ్డి, ఎం.రామాంజనేయులు ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలు, హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

అనంతపురం రూరల్ తహశీల్దార్‌గా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ మండల తహశీల్దార్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలంలో రెవెన్యూ పరంగా అన్ని రకాల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఆమెకు బదిలీపై వెళ్తున్న శ్రీధర్‌మూర్తి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



విజయలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న శ్రీధర్‌మూర్తి

నేరాలు ఘోరాలు

యువకుడు హత్య



నారాయణస్వామి

నార్పల : స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. వివరాలు.. మంగళవారం రాత్రి ఐదుగురు యువకులు నార్పల శ్మశానవాటిక పక్కన ఉన్న మామిడి తోటలో మద్యం తాగారు. వారిలో ఒకడైన నారాయణస్వామి(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. వారు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి హత్య అని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నారాయణస్వామి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు.

సోలార్ ప్లాంట్‌లో వైరు చోరీ

గుత్తి : మండల పరిధిలోని ఎంగిలిబండ గ్రామ సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్(సౌర విద్యుత్ కేంద్రం)లో మంగళవారం రాత్రి వైరు చోరీకి గురైంది. రైతు భార్గవ్‌రెడ్డికి చెందిన 15 ఎకరాల్లో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఆ ప్లాంట్‌కు ఉన్న కంచెను గుర్తుతెలియని దుండగులు కత్తిరించి లోనికి ప్రవేశించి రూ. 7 లక్షల విలువ చేసే దాదాపు 7 వేల మీటర్ల కేబుల్ వైరును ఎత్తుకెళ్లారు. ప్లాంట్ యజమాని భార్గవ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు చోరీ జరిగిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. 11 మందికి గాయాలు

రాయదుర్గం : పట్టణ శివారులో బళ్లారి రోడ్డులోని కుంటి మారెమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం నుంచి బళ్లారి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బళ్లారి నుంచి రాయదుర్గం వైపు వస్తున్న కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రయాణికులు, కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు మద్యం మత్తులో ఉన్నట్టు తెలిసింది.

గడ్డివామి దగ్ధం

ఉరవకొండ : గడ్డివామి దగ్ధమై దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లిన సంఘటన విడపనకల్లు మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. రైతు కురుబ వసికేరికి చెందిన గడ్డివామికి ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని పూర్తిగా బూడిదైంది. విషయం తెలిసిన వెంటనే ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అలాగే బాధిత రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. దాదాపు రూ. లక్ష నష్టం జరిగిందని, పశువులకు గ్రాసం దొరకడం కష్టమంగా న్యాయం చేసేలా చూడాలని ఎంపిపిని కోరారు. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియచేసి, వీలైనంత త్వరగా నష్టపరిహారం అందేలా చూడాలని తహశీల్దార్ ఈరమ్మను ఎంపిపి కోరారు. ఆమె వెంట ఎంపిటిసి తిమ్మరాజు, నాయకులు హంపయ్య, ప్రసాద్, సునిల్‌రెడ్డి, సంజప్ప, చిట్టిబాబు, హనుమంతు, జిలాన్, తదితరులు ఉన్నారు.

వరుస బైక్ చోరీలతో వాహనదారుల బెంబేలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్దేహాల్ గ్రామంలో గత వారం సిండికేట్ బ్యాంకు ముందు ఓ ద్విచక్ర వాహనం, జిరాక్స్ సెంటర్ వద్ద లాక్ చేసి ఉంచిన మరో వాహనం చోరీకి గురయ్యాయని వాటి యజమానులు వాపోయారు. అలాగే నేమకల్లు సమీపంలో పార్సిల్ తీసుకొచ్చే యువకుడి బైక్ ఆపి అతదిపై దాడి చేసి రూ. 10వేలు లాక్కెళ్లారు. గతేడాది రెవెన్యూ కార్యాలయం ముందు ఉంచిన ఓ బైక్, గోవిందవాడలో ఓ వాహనం, దర్గాహొన్నూరు దర్గా వద్ద రెండు వాహనాలు, నేమకల్లులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఓ వాహనం చోరీకి గురయ్యాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఏడాది కాలంలో 10 ద్వి చక్ర వాహనాలు చోరీకి గురైనా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై స్థానిక రూరల్ సిఐ యుగంధర్‌ను వివరణ కోరగా పోలీసులు ఆ పనిలోనే ఉన్నారని త్వరలోనే చోరీకి గురైన వాహనాలను గుర్తించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

వ్యవసాయ కార్మికులు వలస వెళ్లకుండా తక్షణమే ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విడపనకల్లు సచివాల య కేంద్రం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కరువు, వలసల నుంచి రక్షించడానికి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, పని దినాలు 200 రోజులకు పెంచాలని, రోజు వేతనం రూ. 600 ఇవ్వాలని, వ్యవసాయ కూలీలు, పేదలకు నెలకు రూ. 10వేల కరువు పింఛనుతో పాటు నెలకు 35 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలన్నారు. పేద విద్యార్థుల అన్ని రకాల ఫీజులు



పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రద్దు చేయాలని, పేదల ఇళ్లకు ఇస్తున్న విద్యుత్ ఛార్జీలు, బకాయిలు రద్దు చేయాలన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. అన్ని రకాల బ్యాంకు రుణాలు రద్దు చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే నాడు-నేడు పనులను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి(డిఇఒ) నాగరాజు పరిశీలించారు. పెద్దవడుగూరు, దిమ్మగుడి గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి పనులు వేగవంతంగా చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న గుడ్లు పాతబడితే వాటిని వెంటనే మార్పు చేయాలని ఆదేశించారు. బియ్యం నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ గురుప్రసాద్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ నాగరాజు

పత్తి, వేరుశనగలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల పరిధిలోని కోనాపురంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పత్తిపంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గుత్తి ఎడిఎ వెంకటరాముడు, వ్యవసాయ విస్తరణ అధికారిణి రజని సమక్షంలో ఖరీఫ్ సీజన్‌లో రైతు రామ్మూర్తి పొలంలో సాగు చేసిన పత్తిపంటలో 10-10 విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేపట్టగా 2.23 కిలోల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. మండల వ్యాప్తంగా పత్తిపంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ఎఒ మల్లీశ్వరి తెలిపారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని బూదేడు గ్రామ పంచాయతీలో రైతు ఈశ్వరయ్య పొలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వర్షాధార వేరుశనగ పొలంలో బుధవారం ఎఒ సోమశేఖర్ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో ఎకరానికి 170 కిలోల దిగుబడి వచ్చినట్లు ఎఒ తెలిపారు. ఆయన వెంట ఎఎస్ఒ రాజ్యలక్ష్మి, ఎంపిఇఒ లలిత, రైతులు ఉన్నారు.



పెద్దవడుగూరు : కోనాపురంలో పత్తి పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు



గార్లదిన్నె : బూదేడులో వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం సిఐగా వి.హరినాథ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పట్టణ పోలీస్‌స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం వి.హరినాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉరవకొండలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.




నూతన సిఐ వి.హరినాథ్

నూతన సిఐ విలేకరులతో మాట్లాడుతూ మట్కా, జూదం, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని, కేసులు పెడతామని హెచ్చరించారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ తేజమూర్తి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా ఓబుళరెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

స్థానిక మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) ప్రిన్సిపల్‌గా బుధవారం ఓబుళరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా రామాపురం ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించేవారు. ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్కడికి ప్రిన్సిపల్‌గా వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఆస్మా విధులు నిర్వహించారు.



ఇఒఆర్‌డిగా బాధ్యతలు చేపట్టిన శైలజారాణి

ప్రజాశక్తి-నార్పల

మండల నూతన ఇఒఆర్‌డి గా శైలజ రాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీనరసింహ ఉద్యోగోన్నతి బదిలీపై ఎంపిడిఒగా కుందుర్పి మండలానికి వెళ్లారు. ఆయన స్థానంలో ఆత్మకూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శైలజారాణి ఉద్యోగోన్నతి బదిలీపై ఇఒఆర్‌డిగా ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ మండల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని వెల్లుట్ల సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఒ యోగానందరెడ్డి సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ బీమా, జగనన్నకు చెబుదాం, స్పందనలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చంద్రబాబుకు మద్దతుగా నిలుద్దాం

ప్రజాశక్తి-నార్పల

టిడిపి అధినేత చంద్రబాబుకు మద్దతుగా నిలుద్దామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని దుగుమర్రి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ప్రజావేదిక-రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆలం నరసానాయుడు మాట్లాడుతూ సిఎం జగన్ అరాచకాలు, కక్ష సాధింపు చర్యలకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. జగన్‌ను రాజకీయంగా సమాధి చేయడానికి అన్ని వర్గాల వారు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, రాఘవ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బయపరెడ్డి,




దుగుమర్రిలో 'బాబుతో నేను' కార్యక్రమంలో పాల్గొన్న ఆలం నరసానాయుడు, టిడిపినాయకులు

చంద్రబాబు, జాఫర్, వెంకటనారాయణమ్మ, లక్ష్మినారాయణ, తలారి కుళ్లాయప్ప, భక్తవత్సల్, రవి, సత్తయ్య, శీన, చిన్న నాయుడు, భాస్కర్, ప్రశాంత్, రమణయ్య, లక్ష్మమప్ప, వీరనారప్ప, రామాంజి, హనుమంత్‌రెడ్డి, జయసింహా, పెద్దిరెడ్డి, కాటమయ్య, వెంకటేష్, భరత్, సతీష్, జయరాం, నాగార్జున, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని బూదేడు, కమలాపురం గ్రామ సచివాలయాల్లో పలు పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఎంపిడిఒ విజయ్‌భాస్కర్ పరిశీలించారు. ఆయన బూదేడులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంజూరై నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను, సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును పరిశీలించారు. అనంతరం కమలాపురం సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను సందర్శించారు. వీటిని ఈ నెల 28వ తేదీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభిస్తారని తెలిపారు.



కమలాపురంలో సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయ్‌భాస్కర్

ఘనంగా చౌడేశ్వరీ జ్యోతుల మహోత్సవం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

దసరా పండుగ పురస్కరించుకొని బుధవారం పెద్దపప్పూరులో చౌడేశ్వరీ మాత జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి గ్రామంలోని పురవీధుల గుండా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అమ్మవారి భజన పాటలు పాడుతూ నృత్యం చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం 6 గంటల సమయంలో భక్తుల లాలిపాటతో జ్యోతుల మహోత్సవం ముగిసింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శరత్‌చంద్ర పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. జ్యోతిలక్ష్మి తీర్థప్రసాదాలు అందజేశారు. జ్యోతుల మహోత్సవాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

ఉరవకొండ : పట్టణంలోని రెండో వార్డు రేషన్ షాపు డీలర్ లీలావతి ప్రతి నెలా కార్డుదారులకు బియ్యం సక్రమంగా అందించడం లేదని, డీలర్ పరిధిలో 300 కార్డులు ఉంటే వంద మందికి మాత్రమే రేషన్ ఇస్తున్నారని బుధవారం కార్డుదారులు తహశీల్దార్ హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కార్డుదారులు మాట్లాడుతూ ప్రతి నెలా రేషన్ ఇవ్వాలని, ఓ నెలలో రాకపోయినా మరో నెలలో రెండు కోటాల బియ్యం ఇవ్వాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ సదరు డీలర్‌పై విచారణ చేయించి కార్డుదారులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం' అభినందనీయం

ఉరవకొండ : జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు 'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం' కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని రైతులు పేర్కొన్నారు. 'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం' కార్యక్రమంలో భాగంగా 5వ రోజైన బుధవారం వజ్రకరూరు మండల పరిధిలోని రాగులపాడు, తట్రకల్లు, గంజికుంట, వెంకటంపల్లి గ్రామాల పంట పొలాల్లో పని చేస్తున్న 50 మంది రైతులకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల పంపిణీకిచర్యలు

ప్రజాశక్తి-ఉరవకొండ

మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన సర్వే నెంబర్-508 భూమిలో బుధవారం జెసిబిల సాయంతో కంపచెట్లు తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హరిప్రసాద్, వైసిపి పట్టణ కన్వీనర్ ఎసి ఎర్రిస్వామి, సమన్వయకర్త కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ భూమి కోర్టు వివాదంలో ఉందని, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి చొరవతో సమస్య పరిష్కారం కావడంతో పేదల ఇళ్ల స్థలాలకు సంబంధించి హద్దులు చూపడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే లబ్ధిదారులం దరికీ పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జెసిఎస్ మండల కన్వీనర్ ఆసిఫ్, పార్టీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం నాయకులు బసవరాజు, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి-బెళుగుప్ప

దేశం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్ఐ రామకృష్ణయ్య పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం స్థానిక జడ్పి హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ విద్యార్థులకు దిశ యాప్, పోక్సో చట్టం గురించి వివరించారు. అలాగే పోలీసు లు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పోలీస్ అమర వీరుల గురించి విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.